ప్రజాశక్తి
ఆదివారం 3 నవంబర్ 2024

7న జాబ్ మేళా

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ ఆధ్వర్యంలో ఈనెల 7న స్థానిక వైటిసిలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌పిసిఎల్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సులు విశాఖపట్నం ఆర్కేస్ కాంప్లెక్స్ లోని సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కోర్సులు చేసేందుకు ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బిఎస్‌సి కెమిస్ట్రీ పూర్తి చేసిన, 18 నుంచి 28 ఏళ్లలోపు గల అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు వివరాలకు 9121999654, 7993011695 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



ఎమ్మెల్సీ ఎన్నికకు
మోగిన నగారా

- 4న నోటిఫికేషన్.. • 11 వరకు నామినేషన్లు
- 28న ఎన్నిక • డిసెంబర్ 1న ఓట్ల లెక్కింపు
- అమల్లో ఎన్నికల కోడ్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉమ్మడి విజయనగరం జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నగారా మోగింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) ప్రస్తుతం అమలులోకి వచ్చేసింది. ఈ మేరకు జిల్లాల కలెక్టర్ శనివారం ప్రకటనలు విడుదల చేశారు. గత ప్రభుత్వంలో వైసిపి తరపున స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఇందుకూరి రఘురాజు ఎన్నికైన విషయం విధితమే. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు సాగించారన్న అభియోగంతో అదే పార్టీకి చెందిన పాలవలస విక్రాంత్ శాసన మండలి చైర్మన్ మోసేజ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో, చైర్మన్ అనర్హత వేటు విధించి ఈ ఏడాది జూన్ 2న డిస్మిస్ చేశారు. దీంతో, రఘురాజు కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం ఆరువారాల పాటు స్టే విధించింది. త్వరలోనే కోర్టు తీర్పురావాల్సివుంది.

ఈలోపే ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీకి ప్రకటన విడుదల చేయడం గమనార్హం. తాజాగా ఎన్నికల సంఘం జారీచేసిన ప్రకటన ప్రకారం ఈనెల 4వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 12వ తేదీన నామినేషన్లు పరిశీలన, 14వరకు ఉపసంహరణ కొనసాగుతుంది. 28న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. డిసెంబర్ 1న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి. ఈనేపథ్యంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల నియమావళి పాటించాల్సివుంటుంది. నూతన విధానాలు, కార్యక్రమాలను ప్రకటించరాదని ఎన్నికల సంఘం వారికి సూచించింది. అధికారిక కార్యక్రమాలను ఎన్నికల కార్యక్రమాలతో జత చేసి నిర్వహించడానికి కూడా అవకాశం లేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణకు జిల్లాలో వీడియో సర్వైలెన్స్ బృందాలు, ఇతర బృందాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చును పరిశీలించేందుకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ తో సహా అన్ని బృందాలనూ ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ విధి విధానాలకు లోబడి అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాల్సివుంది.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు : కలెక్టర్

స్థానిక సంస్థల శాసనమండలి స్థానానికి ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో, జిల్లాలో శనివారం నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ప్రతీఒక్కరూ విధిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని ఆదేశించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలు తదితర కార్యక్రమాలను చేయరాదని, ఓటర్లను ప్రలోభపెట్టే ఎటువంటి చర్యలను చేయకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. సోమవారం జరిగే గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

- స్థానిక సంస్థల్లో వైసిపి ప్రజాప్రతినిధులే అధికం
- ఆసక్తికరంగా మారిన ఎమ్మెల్సీ ఎన్నిక

మండలి బరిలో
టిడిపి నిలిచేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఆసక్తికరంగా మారింది. స్థానిక సంస్థల్లో అత్యధిక ప్రజాప్రతినిధులు వైసిపికి చెందినవారు ఉండగా, రాష్ట్రంలో టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ లెక్కన వైసిపికే ఎక్కువ బలం ఉంది. వీరంతా పార్టీ విధానానికి కట్టుబడి ఉంటే, ఏం జరుగుతోందో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. కానీ, రహస్య ఓటింగ్ కాబట్టి టిడిపి కాస్త సాహసం చేస్తుందా? లేక విశాఖలో మాదిరిగా వెనక్కి తగ్గుతుందా? అన్నదానిపై అందరిలోనూ ఆసక్తి కర చర్చ నడుస్తోంది. ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, పురపాలక సంఘాల్లో కౌన్సిలర్లు, నగర పాలక సంస్థలో కార్పొరేటర్లకు ఓటు హక్కు ఉంటుంది. ఈ ఎన్నిక పాత విజయనగరం జిల్లా ప్రాతిపదికన జరుగుతుంది. ఈలెక్కన ఉమ్మడి విజయనగరం జిల్లాలో గల తొమ్మిది నియోజకవర్గాల్లో 743 మంది ఓటర్లు ఉండగా, టిడిపి కూటమికి 155 మంది, వైసిపికి 578 మంది ఉన్నారు. 9 మంది మరణించారు. ఒకరు ఇండిపెండెంట్ ఎంపిటిసి ఉన్నారు. ఎంపిటిసి సభ్యులు 549 మందిలో టిడిపికి 100 మంది, వైసిపికి 447 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. 34 మంది జెడ్‌పిటిసి సభ్యులంతా వైసిపి వారే. విజయనగరం కార్పొరేషన్‌లో 50మంది కార్పొరేటర్లు, పార్వతీపురంలో 30మంది, బొబ్బిలిలో 31మంది, సాలూరులో 29మంది, నెల్లిమర్ల నగర పంచాయతీలో 20మంది చొప్పున కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 30 మంది టిడిపి, 129 మంది వైసిపి వారుండగా, ఇతరులు ఒకరున్నారు. తొమ్మిది మంది ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ పి.సూర్యనారాయణరాజుకు కూడా ఓటు హక్కు ఉంది. ఇటీవల కూటమి అధికారంలోకి వచ్చాక టిడిపిలో 21 మంది ఎంపిటిసిలు, ఐదుగురు కౌన్సిలర్లు చేరారు. జనసేనలో ఆరుగురు, వైసిపిలో ఇద్దరు ఎంపిటిసిలు చేరారు. మెజారిటీ స్థానాలు తమవే కాబట్టి గెలుపు తథ్యమని వైసిపి నాయకులు భావిస్తున్నారు. స్వతంత్రంగావున్న ప్రజాప్రతినిధులు సహా చాలా మంది ఓటర్లు తమకు సహకరిస్తారన్న వాదనతో టిడిపి నాయకులు కూడా చెబుతున్నారు. ఆకస్మికంగా నోటిఫికేషన్ జారీ కావడంతో అటు టిడిపి, అటు వైసిపి నాయకులు ఎన్నికల వ్యూహరచనలో నిమగ్నమయ్యారు. టిడిపి తరపున పోటీ చేయాలా? లేదా? అన్నదానిపై అధిష్టానం మల్లగుల్లాలు పడుతుండగా, వైసిపి అభ్యర్థి ఎంపికలో ఆపార్టీ తలమునకలైంది. అతి త్వరలోనే అభ్యర్థి పేరు కూడా ఖరారయ్యే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. విజయనగరం నుంచి ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఉండడంతో ఈసారి మన్యం జిల్లాకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించే అవకాశం ఉంటుందని ఆశిస్తున్నారు.

ఏనుగుల దాడిలో ధ్వంసమైన ఆటో, మిల్లర్

అధికారుల లోపం... ఏనుగుల స్వైరవిహారం

ప్రజలపై పెట్టిన నిర్బంధాన్ని ఎత్తివేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

అటవీ ప్రాంతం వదిలి ఏనుగులు మైదానికి రావడాన్ని అరికట్టలేని అటవీ అధికారులు ప్రజలపై పెట్టిన నిర్బంధ సెక్షన్ల రద్దు చేయాలని, ఏనుగులను అడవికి లేదా జూకు తరలించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అటవీ అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఏనుగులు మైదాన ప్రాంతానికి వచ్చాయంటే ఇది అధికారుల కుట్రలా కనిపిస్తుందని విమర్శించారు. అక్కయ్యపేట, పులిగొమ్మ మధ్య ఉన్న కొండకు తరలించి వన్యప్రాణ సంరక్షణగా చేపడతామని అధికారులు కుట్రలు పన్నుతున్నట్టు కనిపిస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఈ ప్రాంతంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను ఖాళీ చేయాలని అటవీ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, అందుకు ఈ ఏనుగులను మైదాన ప్రాంతంలో సంచరిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఏనుగులను అటవీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతమైన బొండపల్లి, పార్వతీపురం మండలం గ్రామాల వైపు తరలించారన్న చర్చ ప్రజల్లో జరుగుతుందని ఇది అటవీ అధికారుల కుట్రగా కనిపిస్తుందని అన్నారు. శనివారం బొండపల్లి నుండి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను, మిల్లర్ ధ్వంసం చేశాయని, ముందుగా ప్రమాదాన్ని గ్రహించిన ప్రయాణికులు, స్థానికులు పారి పోవడంతో పెద్ద ప్రమాదం, ప్రాణ నష్టం తప్పిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుకి ఏనుగులను తెప్పించి ఈ ఏనుగుల్ని అడవికి లేక జూకు తరలించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్అండ్‌బి ఇఇ

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆర్అండ్‌బి ఇఇ కె.సుబ్బారావు గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఏజెన్సీలో ప్రతి గ్రామానికి రహదారుల సౌకర్యానికి కృషి చేయాలని ఇఇకి ఎమ్మెల్యే సూచించారు. సాధ్యమైనంత వరకు కొత్త రహదారులకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట ఎఇఇసుశీల తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని గొట్టమంగళాపురంలో గల నాగావళి నదిలో నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పాలకొండ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ దావాల రమణారావు మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల వద్ద గల బ్రిడ్జిలు, తాగునీటి పథకాలు వంటి నిర్మాణాలకు 500 మీటర్లు పరిధి దాటిన తర్వాత మాత్రమే ఇసుక తవ్వకాలు జరపాలని కలెక్టర్ ప్రకటించినప్పటికీ ఇందుకు విరుద్ధంగా 100 మీటర్లు 200 మీటర్లు పరిధిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని అన్నారు. దీనివల్ల నీటి పథకాలకు ఇబ్బందులు తలెత్తి, తాగునీటికి కొరత ఏర్పడే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాక వంతెనకు కూడా ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికార యంత్రాంగం పర్యవేక్షణ లేనందున ఇసుక తవ్వకాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని, తక్షణమే వీటిని నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దూసి దుర్గారావు, కాద రాము, మజ్జి వీరంనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిమ్మిలో వైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోని కిమ్మిలో శనివారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, మధుమేహ, రక్తపోటు, తదితరమైన వ్యాధులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నైపుణ్య గణన పక్కాగా చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

తప్పులకు ఆస్కారం లేకుండా జిల్లాలో నైపుణ్య గణన 2024ను పక్కాగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఎంపిడిఒలను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నైపుణ్య గణన 2024పై ఎంపిడిఒలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 15 నుంచి 59 ఏళ్ల లోపు వయస్సుగల వారి పూర్తి వివరాలను నైపుణ్య గణనలో నమోదు చేయించాలన్నారు. ఇందుకు ప్రతి ఎంపిడిఒ, మునిసిపల్ కమిషనర్లు వారి పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి సరైన శిక్షణ ఇచ్చి ప్రతి ఇంటిని సందర్శించేలా చేయాలన్నారు. సచివాలయ సిబ్బందికి పంపే సమయంలో మ్యాపింగ్ అనేది తప్పనిసరి అని తేల్చి చెప్పారు. ఆన్ లైన్ ప్రక్రియ ద్వారా జరిగి నైపుణ్య గణనలో ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉండే ప్రాంతాలను ముందుగా ఎంచుకొని, వాటి పరిధిలో గణనను చేపట్టాలని సూచించారు. జిల్లాలో రక్తహీనత లోపం ఉన్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని, అందుకే మేము సైతం కార్యక్రమానికి శ్రీకారం చుట్టి రక్తవిల్వలు ఉండేలా చర్యలు చేపట్టిన సంగతిని కలెక్టర్ గుర్తుచేశారు. అందులో భాగంగా ప్రతి ఎంపిడిఒ తమ పరిధిలోని కళాశాలలు, యువతకు అవగాహన కల్పించి, రక్తదాన శిబిరం నుండి కనీసం 75 యూనిట్ల రక్తం సేకరణ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రక్తహీనత లోపం ఉన్న వారిని గుర్తించి అవసరమైన పోషకాహారం, మందులు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో డిజిటల్ లైబ్రరీల కోసం 11 మండలాల్లో ఇప్పటికే సామాగ్రిని పంపిణీ చేశామని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు.

అంగన్వాడీలను అందంగా తీర్చిదిద్దాలి

ప్రభుత్వ భవనాల్లో గల 516 అంగన్వాడీ కేంద్రాలను అందంగా తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన నిధులను మంజూరు చేసినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో కనీస మౌలిక వసతులు ఉండాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒలను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల కోసం కేటాయించిన నిధులు ఆర్‌డబ్ల్యుఎస్ వద్ద సిద్ధంగా ఉన్నాయని, వాటిని ఆయా మండలాల్లోని ఎఇల ద్వారా సర్దుబాటు చేస్తామని, కావున వెంటనే విధులను విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుత్, పెయింటింగ్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులపై జిల్లా కలెక్టర్ ఎంపిడిఒలు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమీక్షించారు. ప్రతి కేంద్రంలో రెండు ట్యూబులైట్లు, ఒక ఫ్యానుతో పాటు

ఎంపిడిఒల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

తాగునీరు, మరుగుదొడ్డి సదుపాయాలు ఏర్పాటుచేసు కోవాలని, ఇంకా నిధులు అందుబాటులో ఉంటే వాటితో పిల్లలు ఆడుకునే ఆట పరికరాలను కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. ఇచ్చిన లక్ష్యాలను ఈనెల 14లోగా పూర్తిచేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మోడల్ అంగన్వాడీ కేంద్రానికి అవార్డును ప్రకటిస్తామని, వీటికి సంబంధించిన వీడియోను, ఫొటోలను తమకు పంపాలన్నారు.

6 నుంచి కంటి వెలుగు పరీక్షలు

జిల్లాలో కంటి వెలుగు కింద చేపడుతున్న దృష్టి లోపం నిర్ధారణ పరీక్షలను ఈనెల 6 నుంచి నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ రూపొందించిన ముందస్తు ప్రణాళికను ఎంపిడిఒలకు వివరించారు. ముందుగా సీతంపేట, గుమలక్ష్మీపురం, సాలూరు, పాచిపెంట, జియమ్మవలస, కొమరాడ మండలాల్లో గల పిహెచ్‌సిల పరిధిలోని సచివాలయాల్లో ఈనెల 6 నుంచి జనవరి 20 వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణపై ఎంపిడిఒలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలోని 15 ఏళ్ల దాటిన వారందరికీ కంటి పరీక్షలను నిర్వహించి, వారికి అవసరమైతే శస్త్రచికిత్సలు చేపడతారని అన్నారు. కళ్ల జోళ్లు కలిగిన వారు కూడా తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా వారి కంటి పరిస్థితి తెలుస్తుందని తెలిపారు సచివాలయం నుంచి కనీసం రోజుకు 20 మంది హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. శస్త్రచికిత్స సమయంలో తగిన రవాణా ఏర్పాట్లు చేస్తారని వివరించారు. ఎంపిడిఒలు బాధ్యత తీసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డాక్టర్ వినోద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.సాయికృష్ణ చైతన్య, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంటినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, ఎంపిడిఒలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాల నివారణకు సమిష్టి కృషి

ప్రజాశక్తి - పార్వతీపురం

శిశు మరణాలు జరగకుండా సమష్టి కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె. విజయపార్వతి అన్నారు. ఈ మేరకు శిశు మరణాలపై జిల్లా ఉప స్థాయి కమిటీ సమావేశాన్ని ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్, సెప్టెంబర్ వరకు జిల్లాలో జరిగిన శిశుమరణాలపై కమిటీ సమీక్ష జరిపారు. జిల్లాలో మర్రిపాడు, మాదలింగి, మొండెంఖల్లు, నీలకంఠపురం, దోనుబాయి, గరుగుబిల్లి, మామిడిపల్లి, శంబర, అరసాడ, తోణం, భామిని పిహెచ్‌సిలు, చర్చివీధి అర్బన్ పిహెచ్‌సి పరిధిల్లో జరిగిన మొత్తం 13 శిశు మరణాలకు సంబంధించి కారణాలపై వైద్యాధికారులు, వైద్య సిబ్బందిని కమిటీ ఆరా తీశారు. ప్రతి శిశు మరణానికి సంబంధించి సమర్పించిన ఆరోగ్య నివేదికల వివరాలను కమిటీ నిశితంగా పరిశీలించి అందుకు గల కారణాలపై విశ్లేషించారు. ఆసుపత్రి, క్షేత్ర స్థాయిల్లో ఏ విధమైన చికిత్స, పర్యవేక్షణ చేయడం జరిగినదో సమీక్షించారు. శిశు మరణాలు జరగకుండా పిల్లల ఎదుగుదల, ఆరోగ్యమే ధ్యేయంగా వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమష్టి కృషి చేయాలని ఎక్కడైనా నిర్లక్ష్యాన్ని గుర్తిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ నారాయణరావు, జిల్లా ఆసుపత్రి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్‌వి రామ్మూర్తి, ప్రోగ్రాం అధికారులు టి.జగన్మోహనరావు, రఘుకుమార్, వినోద్ కుమార్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వెంకటరావు, ఐసిడిఎస్ నోడల్ పర్సన్ ఎన్.రాజ్యలక్ష్మి, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర పోరాటమే యుటిఎఫ్ ధ్యేయం

ప్రజాశక్తి- సీతానగరం

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందని యుటిఎఫ్ సీతానగరం మండల శాఖ ప్రధాన కార్యదర్శి బొత్స ప్రసాదరావు అన్నారు. నవంబర్ 3న పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో జరుగు యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభకు ఉపాధ్యాయులంతా తరలి రావాలని కోరుతూ శనివారం ప్రచారం చేశారు. మండల శాఖ అధ్యక్షులు పల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ యుటిఎఫ్ విప్లవాత్మక పోరాటం సమస్యల పరిష్కారానికి మార్గదర్శనమని అన్నారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి మండల శాఖ ప్రతినిధులు, ఉపాధ్యాయులతో కలిసి స్వర్ణోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు అంది పోలినాయుడు, జిల్లా కౌన్సిల్ సభ్యులు మర్రాపు గోవిందరావు, మండల కౌన్సిల్ సభ్యులు బడే సురేష్ కుమార్, చుక్క గణపతి పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలు

ప్రజాశక్తి- సీతానగరం

68వ రాష్ట్రస్థాయి విలువిద్య క్రీడాపోటీలు ఆదివారం నుంచి మూడు రోజులపాటు మండలంలోని జోగంపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో జరుగుతాయని స్కూల్ గేమ్స్ జిల్లా ప్రెసిడెంట్, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు తెలిపారు. శనివారం జోగమ్మపేటలో పీడీలు, పిఇటిలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. అండర్-14, 17, 19 బాలురు, బాలికలకు ఈ పోటీలను నిర్వహిస్తామన్నరు. ఆదివారం జరిగే ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ హాజరవుతారని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ తిరుపతినాయుడు

ఈ సమావేశంలో ఉప విద్యాశాఖాధికారి రాజ్ కుమార్, ఏపీ స్కూల్ గేమ్స్ సెక్రటరీ జి. భానుమూర్తి రాజు , జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు, స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ ఎం మురళీకృష్ణ, ఎంఇఒలు సూరి దేముడు, కర్రి ప్రసాదరావు, దత్తి అప్పల నాయుడు, స్థానిక ప్రిన్సిపాల్ జేవిఎస్ మధుబాబు, పీడీలు, డిటి గాంధీ, శ్రీను, వైకుంటరావు, తిరుపతిరావు, వాసు దేవనాయుడు, చక్రవర్తి, నాగమణి, చంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తరలివచ్చిన క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి విలువిద్య క్రీడల్లో పాల్గొనేందుకు బాల, బాలికలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. మహిళా క్రీడాకారులకు జోగంపేట కేజీబీవీలోను, మగ క్రీడాకారులకు సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో బస ఏర్పాటు చేసినట్లు డిఇఒ తిరుపతి నాయుడు తెలిపారు. మూడు రోజులపాటు తాను దగ్గరుండి పర్యవేక్షణ చేస్తూ క్రీడా అంశాలతోపాటు జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశాలను ఏర్పాటు చేసి పదవ తరగతి విద్యార్థులపై తీసుకోవలసిన ప్రత్యేకత దృష్టి పెడతానని ఆయన చెప్పారు.

గుంతల బాగోతంలో ఒరిగిందెంత?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'తడి తక్కువ తమాషా ఎక్కువట. అచ్చంగా అలాగే ఉంది జిల్లాలో తలపెట్టిన గుంతల పూడ్చివేత, దీనిపై ప్రభుత్వ యంత్రాంగం ప్రచారానికి సిద్ధపడిన తీరు. ఈతకాయంత నిధులు ఇచ్చి, తాటికాయంత ప్రచారం చేసుకునేందుకు తహతహలాడిపోయారు. నిధులు తక్కువ కేటాయించినందుకు ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అధికార పార్టీ నాయకులు, పెద్దలు, ప్రజాప్రతినిధులు ఈ పనులు ప్రారంభానికి ఏకంగా ముఖ్యమంత్రి రావడమే గొప్ప విషయంగా భావించారు. ఈ మాటకొస్తే గుంతలు పూడ్చే కార్యక్రమానికి మునుపెన్నడూ ఇంత హడావుడి జరగలేదు. ముఖ్యమంత్రి స్థాయిలో ప్రారంభోత్సవాలు చేయలేదు. కానీ, శనివారంనాడు ఈ పనులు ప్రారంభించేందుకు సిఎం వస్తారన్న నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కేటాయించిన సమయం అంతా ఇంతా కాదు. జిల్లా అధికారులు మొదలుకుని కొన్ని శాఖల సిబ్బంది వరకు దీపావళి పర్వదినంలో కూడా ఇంటిల్లపాదీ కలిసిమెలిసి ఉండే అవకాశం కోల్పోయింది. రాత్రి పగలు అనే తేడా లేకుండా శ్రమించారు. కొంతమందికి రెండు రోజులపాటు కంటిమీద కునుకులేదు. సిఎం కార్యక్రమం కోసం గజపతినగరం మండలం గంగచోళ్లపెంట, పురిటిపెంట గ్రామాల్లో హెలీప్యాడ్ తయారీ, నేల చదును చేసేందుకు టిప్పర్లు, ట్రాక్టర్లు, ట్యాంకర్లు, రోలర్లు, బుల్డోజర్లు, షామియానాల ఏర్పాటు తదితరాల అద్దెలు, మీటింగ్ హాల్ ఏర్పాటు, శిలాఫలకం వంటివాటికి సుమారు రూ.కోటి వరకు ఖర్చుచేశారు. తీరా ఆ రోజు రాత్రికి జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో సిఎం పర్యటన అనివార్యంగా రద్దయ్యింది. కోడ్ అమల్లో ఉన్నందున సిఎం రాలేదని ఎవరూ నిందించలేదు. ఈ సంగతి కాస్త అటుంచితే... గుంతలు పూడ్చే కార్యక్రమంపై ప్రచారానికి ప్రభుత్వ పెద్దల ఆత్రం అంతా ఇంతా కాదని జనం నుంచి వినిపిస్తున్న మాట. రహదారుల నిర్మాణం, వాటి

మెయింటినెన్స్ అనేది ప్రభుత్వ బాధ్యత, ప్రయాణికుల నుంచి రోడ్డు ట్యాక్స్, టోల్ గేట్ ఛార్జీల రూపంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేస్తున్నాయి. ఈ భారాన్ని తగ్గించగలిగితే ప్రభుత్వం గొప్పగా చెప్పుకోవడంలో తప్పులేదు. కానీ, రోడ్ల మరమ్మతులకే ఇంత గొప్పగా చెప్పుకోవడమా? అనేది పబ్లిక్ టాక్. సరే గత ప్రభుత్వం కన్నా తామే ఎంతో మేలు చేస్తున్నామన్న ఆత్రంతో ఆమాత్రం హంగామా చేసివుంటే తప్పేంటి? అని ప్రభుత్వం, మన జిల్లాలోని ప్రతిజాప్రతినిధులు భావించి వుండవచ్చు అనుకున్నా, ఈ గుంతల బాగుచేయడానికి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కేటాయించిన మొత్తం ఎంత? అందులో మన జిల్లాకు వచ్చిన మొత్తం ఎంత? అంటే ఆవగింజలో అరవైవ వాటాయేనని తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది చోట్ల రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చేందుకు రూ.826కోట్లు అంటూ గడిచిన మూడు రోజులుగా జిల్లా పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రకటన విడుదల చేశారు. మరి ఇందులో మన విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు కేటాయించిందెంత? ఇది ఉమ్మడి విజయనగరం జిల్లా వాసులు సంధిస్తున్న ప్రశ్నలు. విజయనగరం జిల్లాలో 73 పనులకు కేవలం రూ.10.57కోట్లు. ఆర్అండ్‌బి అధికారుల లెక్కల ప్రకారం అయితే 63 పనులకు రూ.10.02కోట్లు మాత్రమే. పార్వతీపురం మన్యం జిల్లాలో అయితే 5పనులకు రూ.13.70కోట్లు కేటాయించినట్టు సమాచారం. ఈలెక్కన గుంతల పూడ్చివేతకు రాష్ట్ర వ్యాప్తంగా కేటాయించిన నిధుల్లో విజయనగరం జిల్లాకు ఇచ్చింది కేవలం 14శాతంలోపే. మన్యం జిల్లాకూ దాదాపు ఒక్కశాతం అటూ ఇటుగా అంతే లెక్క. ఈ మాత్రం సాయానికి మన జిల్లాకు చెందిన నాయకత్వం ఇంతలా మురిసిపోతే ఎలా? అన్నది పలువురి వాదన. అందులోనూ సిఎం ప్రారంభానికి తలపెట్టిన గుంతల పని కూడా అక్షరాలా ఆరు కిలోమీటర్లు, దానికి కేటాయించిన మొత్తం కేవలం రూ.37లక్షలే. ఇలాంటి పరిస్థితుల్లో సిఎం ప్రసన్నం పొందేదానికన్నా మరింతగా నిధులు రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తే బాగుండేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా ఇంత తక్కువ మొత్తంలో చేపట్టే పనులకు ఇంత హడావుడి చేయడం మానుకుంటే బాగుంటుందన్నది పబ్లిక్ టాక్. గుంతల పూడ్చివేతకే ఇంతలా ప్రచారం చేసేందుకు సిద్ధపడితే కొత్తగా రోడ్లు వేస్తే ఇంకెంత హడావుడి చేస్తారో అంటూ జనం విస్తుపోతున్నారు.

మినీస్టేడియం పూర్తి చేయాలని ఎమ్మెల్యే లేఖ

ప్రజాశక్తి - కురుపాం

చైర్మన్‌కు లేఖ అందిస్తున్న రంజిత్

గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిన మినీ స్టేడియం నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శాప్ చైర్మన్ అనిమి రవినాయుడుకు లేఖ రాశారు. 2018లో రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్న నారా లోకేష్ శంకు స్థాపన చేశారని పనులు ప్రారంభమై సగం నిర్మాణం పూర్తైన తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంతో వ్యవహరించిన కారణంగా పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయని, ప్రాథమిక గల క్రీడాకారులకు తీవ్ర అన్యాయం జరిగిందని లేఖలో పేర్కొన్నారు. తక్షణమే పనులు జరిగేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయంపై శాప్ చైర్మన్ అనిమి రవినాయుడు స్పందిస్తూ మినీ స్టేడియం నిర్మాణానికి మొదటి ప్రాధాన్యత కల్పించి నిధులు మంజూరుకు హామీ ఇస్తున్నట్లు తెలుగు యువత అధికార ప్రతినిధి, మాజీ ఎంపిటిసి ప్రైజన్ కోలా రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

స్వచ్ఛ పార్వతీపురం దిశగా అడుగులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణాన్ని స్వచ్ఛ పార్వతీపురం పట్టణంగా తీర్చిదిద్దేందుకు అడుగులు వేద్దామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు అన్నారు. స్వచ్ఛ సుందర అవగాహన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రెండో వార్డు కొత్త వీధిలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పకీరురాజు, సచివాలయాల శానిటరీ కార్యదర్శులు నిర్వహించారు. స్థానిక వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ కమిషనర్ మాట్లాడుతూ పార్వతీపురాన్ని స్వచ్ఛ సుందర పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడేందుకు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్లాస్టిక్ రహిత సంచులను వినియోగించేలా ప్రజలు బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ కో-ఆర్డినేటర్ బార్నాల సీతారాం, ఎఎస్ఐ వీరినాయుడు, శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో ద్రవ జీవామృతం నేలలో పోషకాలను పెంచడంలో ప్రముఖపాత్ర వహిస్తుందని గరుగుబిల్లి మండలం కొంకడివరం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పక్కి రవీంద్రనాథ్ అన్నారు. శనివారం పాఠశాలలో ద్రవజీవామృతాన్ని తయారు చేయడాన్ని విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు దగ్గరుండి నేర్పించారు. గరుగుబిల్లి మండలం, కొంకడివరంలోని పాఠశాలలో సహోపాధ్యాయులు ముదిలి లక్ష్మంనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు ద్రవజీవామృతం తయారీ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ద్రవజీవామృతం మొక్కలకు, నేలకు ఏవిధంగా మేలు చేస్తుందో ఈ సందర్భంగా లక్ష్మం నాయుడు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పక్కి రవీంద్రనాథ్‌తో పాటు ఉపాధ్యాయులు పి. వెంకటనాయుడు, చందక గాయత్రీరావు పాల్గొన్నారు.

యువత శ్రమదానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండల కేంద్రమైన గుమ్మ లక్ష్మీపురంలో గడ్డి కాలనీ యువత ఆ కాలనీ నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను శ్రమదానం చేసి తొలగించారు. రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం అంతా పోగుచేసి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. పరిసరాలు పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో యువత చేసిన కృషిని ప్రతి ఒక్కరూ అభినందించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో పరిసరాల పరిశుభ్రత పాటించాలని సర్పంచి బొత్తాడ గౌరీశంకరరావు సూచించారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి- సీతానగరం

సీతానగరం ఎక్సైజ్ అండ్ ప్రొబిహిషన్ సర్కిల్ పరిధిలో సీతానగరం, బలిజిపేట, గరుగుబిల్లి మండలాల్లోని గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ అండ్ ప్రొబిహిషన్ సిఐ పద్మావతి తెలిపారు. శనివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో మండలంలోని 21 గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం అమ్మకాలు చేపట్టిన, నాటుసారా అమ్మకాలు జరిగిన వెంటనే సమాచారాన్ని అందజేయాలన్నారు. గ్రామంలో అసాంఘిక కార్యక్రమాల నివారణలో మహిళా పోలీసులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ షరీఫ్, సిబ్బంది పి.అప్పలకొండ, కె. గౌరు, జి భూషణరావు, అనంతరావు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

శంబర హుండీ ఆదాయం రూ.2.07లక్షలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని సంబర పోలమాంబ అమ్మవారి ఆలయ హుండీలను శనివారం లెక్కించగా నాలుగు నెలలకు సంబంధించి సుమారు రూ.2,07,916 ఆదాయం లభించినట్లు ఇఒ వివి సూర్యనారాయణ వెల్లడించారు. పార్వతీపురం మన్యం జిల్లా దేవాదాయ శాఖ అధికారులు, పోలీస్ రెవెన్యూ, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించినట్లు వివరించారు. ఈ సందర్భంగా చదురు గుడి హుండీల ద్వారా రూ.1,10,028లు వనం గుడి హుండీల ద్వారా రూ.97,888 ఆదాయం వచ్చిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాలూరు గ్రూపు దేవాలయాల కార్య నిర్వహణఅధికారి టి రమేష్, ఎంపిటిసి పోలినాయుడు, మాజీ చైర్మన్ దాలినాయుడు, నైదాన సూర్యయాదవ్, మద్ది రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, తమలో ఉన్న ప్రతిభను ప్రదర్శిస్తూ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో రాణించాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్‌లో జిల్లా స్థాయిలో తమ సత్తాను చాటి పలు పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ చందర్ విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటి పథకాలు సాధించాలని ఈ ప్రాంత పేరును మరింత ఇనుమడింప చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు మురళి తిరుపతి, ఎంపిటిసి తవిటి నాయుడు, మాజీ ఎంపిపి గౌరీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నబగ్గ ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని చిన్నబగ్గా గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను దత్తత అధికారి, ఐటిడిఎ ఉప విద్యాశాఖ అధికారి పాలక నారాయడు శనివారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. లెక్కలు ఫిజిక్స్ సబ్జెక్టులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని హెచ్ఎం శ్రీనివాసరావుకు ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలన్నారు. శతశాతం వచ్చేటట్లు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ముందుకు తీసుకురావాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. డిసెంబర్ నెలాఖరికి 10వ తరగతి సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈయన వెంట డిప్యూటీ వార్డెన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సిమెంట్ దుకాణంలో మంటలు

ప్రజాశక్తి -భామిని

స్థానిక ఎస్‌టి వీధిలో శనివారం సాయంత్రం సిమెంటు, ఇనుము దుకాణంలో మంటలు చెలరేగాయి. షాపులో ఒక్కసారిగా అగ్గి వ్యాపించడంతో షాప్‌లో నిల్వ చేసిన పైపులు, విద్యుత్ పరికరాలు, ఇతర వస్తువులు కాలిపోయాయి. షాప్ పక్కన నిలిపివేసిన బొలెరో వాహనం కూడా పాక్షికంగా కాలిపోయింది. అగ్ని మంటలు ఎక్కడ నుండి వస్తున్నాయో అని తెలుసుకుని, జాగ్రత్త పడే లోగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయని షాప్ యజమానులు కొల్ల మధు, కడి శ్రీను తెలిపారు. షాప్‌లో గల విద్యుత్ మీటర్, తీగల నుండి చిన్న పాటి మంటలు రావడంతో ప్రమాదం చోటు చేసుకుందని వారు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం చోటుచేసుకోలేదు. లక్షలు ఖరీదు చేసి నిల్వ చేసిన సామాన్లు కాలిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పంటల బీమాపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి రైతుకు పంటల బీమాపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఉద్యాన శాఖ అధికారిణ సిహెచ్. గిరిజ అన్నారు. మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ చింతమానుగూడలో జీడి రైతులకు పంటల బీమాపై శనివారం అవగాహన కల్పించారు. సందర్భంగా ఆమె రైతులనుద్దేశించి మాట్లాడుతూ కొత్త పంటల బీమా ప్రభుత్వం కల్పించిందని, ఇది నవంబర్ 15లోగా రైతులు జీడీ, మామిడికి నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం గిరిజన రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి గిరిజ

సీతంపేట : మండలంలోని ధారపాడు పంచాయతీ రామానగరం, గోలుకుప్ప గూడలో సిపిఎం శాఖ మహాసభలో జరిగింది. తొలుత సీనియర్ నాయకులు ఎ.చిరంజీవి జెండా ఆవిష్కరించారు ఈ సందర్భంగా వాటర్ ట్యాంక్ ఉపయోగంలో లేదన్నారు. దీంతో ఊటనీరును రామనగరం కోలనీ, గొలుకుప్పగూడ, పెద్ద గూడ, చింతలపూడి గ్రామాల గిరిజనులు తాగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన తాగునీరందక రోగాలు బారిన పడుతున్నారని, కావున తక్షణమే అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, ఎ.భాస్కరరావు, పరుశురాం, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

భూములను పేదలకు అప్పగించాలి

ప్రజాశక్తి- పాచిపెంట

నిరసన తెలుపుతున్న గిరిజనులు

అన్యాక్రాంతమైన పేదల అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములను పేదలకు అప్పగించాలని, అన్యాక్రాంతమైన ప్రాంతాల్లో సమగ్ర దర్యాప్తు చేసి పేదలకు న్యాయం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం సిపిఎం ఆధ్వర్యంలో శనివారం గిరిజనులు అమ్మవలస వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పాముల సన్యాసిరావు, రాము, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని పద్మాపురం, గురువు నాయుడుపేట, మోసూరు, పాంచాలి, కర్రివలస, పాచిపెంట మండల రెవెన్యూ పరిధిలో పేదల అసైన్డ్ భూములు అన్యాక్రాంతం పై సమగ్ర దర్యాప్తు చేసి గిరిజనులకు పేద రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతం చేసిన వారిపై చర్యలు తీసుకొని పేదల భూములు పేదలకు అప్పజెప్పాలని, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు చేసి పేదల భూములకు రక్షణ కల్పించాలని కోరారు. పేదలంతా ఐక్యంగా తమ భూములు సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన పేదలు పాల్గొన్నారు.

విడివికెలకు స్థలాలు గుర్తించండి

ప్రజాశక్తి - పార్వతీపురం

మాట్లాడుతున్న పిఒ.. హాజరైన అధికారులు, సిబ్బంది

ఐటిడిఎ పరిధిలో చేతివృత్తుల కళాకారుల బజార్లు, గోకులాలు, వన్ ధన్ వికాస కేంద్రాలు, బహుళ ప్రయోజన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఐటిడిఎ పిఒ అశుతోశ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన స్థలాలను గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో చేతివృత్తుల బజార్లు, విడివికెలు, మల్టీపర్పస్ సెంటర్లు, గోకులాలపై సంబంధిత అధికారులతో పిఒ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో చేతివృత్తుల కళాకారులను ప్రోత్సహించే దిశగా ప్రత్యేక బజార్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వన్ ధన్ వికాస కేంద్రాలు, బహుళ ప్రయోజన కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధికల్పనతో పాటు ఆర్థికంగా ఎదిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గోకులాలను ఏర్పాటు చేసి వాటితో ఆర్థిక ప్రయోజనం పొందే దిశగా ప్రోత్సహించనున్నట్లు ఆయన వివరించారు. వీటి ఏర్పాటు కోసం అవసరమైన స్థలాలను గుర్తించాలని, ఏర్పాటు తదుపరి అవి బాగా వినియోగంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను పిఒ కోరారు. సమావేశంలో డెప్యూటీ డిఎంహెచ్, వెలుగు ఎపిడి, ఎపిఎంలు, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇలు, డిఇఇలు, ఎఇఇలు, పశు సంవర్థక శాఖ ఉప సంచాలకులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వినికిడి పరికరాలకు 27మంది గుర్తింపు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పరికరాలను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ విజయపార్వతీ

వినికిడి సమస్యతో ఇబ్బంది పడుతున్న వారికి జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో(డిఇఐసి) ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి శనివారం సందర్శించారు. అక్కడ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందంతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్, విజయవాడ వారి సౌజన్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించి వినికిడి సమస్య ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, వీరిలో అవసరమైన వారికి వినికిడి యంత్రాలను ఈ ఫౌండేషన్ వారు ఉచితంగా అందజేయనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ పార్వతి మాట్లాడుతూ పుట్టుకతో గానీ, ఎదుగుదల క్రమంలో గానీ వినికిడి సమస్య, ఇతర లోపాలు ఉన్నవారిని త్వరగా గుర్తించడంలో వైద్య సిబ్బంది దృష్టి సారించాలని, తద్వారా వారికి అవసరమైన చికిత్సా పద్ధతుల ద్వారా మంచి ఆరోగ్య భవిష్యత్ ను అందించి వారి జీవన ప్రమాణాలు మెరుగు పడతాయన్నారు. ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్ మాట్లాడుతూ ఈ శిబిరంలో డిఇఐసి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ భరత్ చంద్ర, ఇఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ కోటేశ్వరరావు, వైద్యబృందం ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. 18 ఏళ్ల లోపు 39 మందికి తనిఖీలు చేపట్టగా 13 మందిని, 18 ఏళ్లు పైబడిన వాళ్ళు 74 మందికి తనిఖీలు నిర్వహించగా 14 మందిని ఎంపిక చేశారు. వీరికి ఫౌండేషన్ వారు ఉచితంగా వినికిడి యంత్రాలను త్వరలో అందజేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, విజయనగరం ఆర్‌బిఎస్‌కె మేనేజర్లు పి.లోక్‌నాథ్, ప్రశాంత్, డిఇఐసి వైద్యాధి కారులు డాక్టర్ లలితదుర్గ, డాక్టర్ సౌజన్య, ఆడియాలజిస్ట్ ఎం.రత్న, చైల్డ్ సైకాలజిస్ట్ ఉదయ్ కుమార్, డిఇఐసి సిబ్బంది పాల్గొన్నారు.

రికవరీల విధానాలు విడనాడాలి

ప్రజాశక్తి - పాలకొండ

ఆర్‌టిసి బస్సుల డ్యామేజీలు, రికవరీల నుంచి సిబ్బంది వసూలు చేసే విధానాన్ని విడనాడాలని ఎపిపిటిడి (ఆర్టీసీ)ఎంప్లాయిస్ యూనియన్ జోన్ అధ్యక్షులు కెజె శుభకరరావు, జోన్ కార్యదర్శి భాసురు కృష్ణ మూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసిన అనంతరం కొంతమంది అధికారులు టైర్లు, స్ప్రింగ్ ప్లేట్లు, గ్లాస్, బస్సు, టిమ్స్ డ్యామేజీలపై ఎవరికి నచ్చిన విధంగా వారు నిబంధనలను అతిక్రమించి వేలాది రూపాయిలు ఉద్యోగుల జీతాల నుంచి డబ్బులు కట్టమని ఒత్తిడి చేస్తున్నారన్నారు. డబ్బులు కట్టలేని ఉద్యోగులకు చార్జి షీట్లు ఇచ్చి ఫైనల్ ఆర్డర్సు ద్వారా జీతాల నుండి రికవరీలు చేస్తున్న విధానాలు విడనాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని పరిశీలించి ఉద్దేశపూర్వకంగా కాకుండా విధి నిర్వాహణనలో జరుగుతున్న ఈ డ్యామేజీలకు వేలాది రూపాయిలు రికవరీ చేస్తామంటున్న విధానాలు, బెదిరింపుల నుంచి విముక్తి కల్పించాలన్నారు. అలాగే ఇంతవరకు ఇలాంటి వాటిపై రికవరీ ఉత్తర్వులు ఇచ్చినవారికి, రికవరీ చేసిన ఉద్యోగులకు ఆ మొత్తాన్ని తిరిగి వారికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ఇలాంటి కేసుల్లో అప్పీళ్లు పెట్టుకున్న వారికి కూడా న్యాయం చేసేలా చూడాలని ఇయు జోనల్ కమిటీ తరపున జోనల్ అధికారులను కోరారు. అలాగే ఇటీవల కాలంలో కొన్ని నిర్ణయాలు మేనేజ్మెంట్ ఏకపక్షంగా తీసుకున్నవి కూడా రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జోన్ పరంగా సమస్యలపై వినతిని అందజేశారు. భవిష్యత్తు కార్యాచరణ ఈనెల 6న విజయవాడలో జరుగు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామనిబికె మూర్తి, శుభాకరు తెలిపారు.

4న మన్యం ర్యాలీ

ప్రజాశక్తి - సీతంపేట

మండల కేంద్రంలో సోమవారం ఈనెల 4న ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శాంతియుత మన్యం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జెఎసి నాయకులు తెలిపారు. దీని అనుమతి కోసం పాలకొండ డిఎస్‌పి రాంబాబును కలిసి అనుమతి కోరారు. హై స్కూల్ నుండి ఐటిడిఎ వరకు గిరిజన సమస్యలపై మన్యం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినతిని ఇచ్చిన వారిలో వైస్ చైర్మన్ బిడ్డిక శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బిడ్డిక ఉమామహేశ్వరరావు, సవర చిరంజీవి, మండంగి విశ్వనాథం, బిడ్డిక రామారావు, కొండగొర్రి భాస్కరరావు, సవర మోహన్ పాల్, బిడ్డిక రాము తదితరులు పాల్గొన్నారు.

ఎర్రన్నాయుడు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ, రాష్ట్ర జాతీయ స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించిన ప్రియతమ నేత కింజరాపు ఎర్రన్నాయుడు సేవలు మరువలేనివని, ఆయన లేని లోటు తీర్చలేనిదని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. దివంగత నేత ఎర్రన్నాయుడు 12వ వర్ధంతి సందర్భంగా శనివారం టిడిపి పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఎర్రంన్నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకుని ఎంతోమంది నాయకులకు ఎర్రంన్నాయుడు ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే కొనియాడారు. ఆయన లేని లోటు పార్టీతో పాటు రాష్ట్రానికి తీర్చలేనిదని అన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శాలను ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పాలకొండ: కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 12వ వర్ధంతి ఇన్చార్జి పట్టణ మాజీ టిడిపి అధ్యక్షుడు గుమ్మడి సింహాద్రి అధ్వర్యంలో పాలకొండ పెద్ద కాపు వీధిలో గల ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పాలకొండ పట్టణ కార్యకర్తలు గుమ్మడి ఉమామహేశ్వరరావు, మంత్రి దుర్గారావు, దుప్పాడ నారాయణరావు, శ్వాసపు చిన్నయ్య, ఉదయాన సూర్యనారాయణ, దుప్పాడ దుర్గారావు, బుగత పైడిరాజు, ఎన్ దుర్గారావు, పుర్లి జగన్నాథం, బొచ్చ తవిటి నాయుడు, మంజూరాపు శ్రీనివాసరావు, మజ్జి సూర్యనారాయణ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం: మాట్లాడుతున్న ఎస్ఐ నారాయణరావు

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు, గంజాయి, డ్రగ్స్ వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వ చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కురుపాం : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్ఐ నారాయణరావు అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రానికి సమీపంలో గల గుజ్జుపాడు గ్రామంలో యువతకు సైబర్ క్రైమ్, రోడ్ యాక్సిడెంట్లు, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఎక్కువమంది మత్తు పానీయాలకు, మత్తు పదార్థాలకు బానిసలై రహదారి ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు వదులుకుంటున్నారని, కుటుంబం ఆర్థిక పరిస్థితి బాగుండాలంటే యువతే కీలకమని అటువంటి యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగంలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్య క్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ యువత, పెద్దలు పాల్గొన్నారు.

వంతెన పూర్తి చేయండి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

వెలగవలస వద్ద వంతెన నిర్మాణం పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. జిల్లేడువలసలో శనివారం సిపిఎం పార్టీ మహాసభ నిర్వహించారు. ఇందులో భాగంగా వంతెన నిర్మాణం చేయాలని కోరుతూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా కోరాడ ఈశ్వరరావు జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో వెళగవలస వద్ద సువర్ణముఖి నదిపై నిర్మాణాన్ని మధ్యలో నిలిపేసారని దీని ద్వారా వర్షాకాలంలో జిల్లేడు వలస, ములక్కయవలస, బొడ్డపాడు, నరింజపాడు గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారని చెప్పారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు స్థానిక మంత్రి గుమ్మడి సంధ్యారాణి కూడా ఈ వంతెనను త్వరగా పూర్తిచేయాలని పలుమార్లు అప్పటి వైసిపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడి సంధ్యారాణి కూడా మంత్రి అయ్యారని ఈ నేపథ్యంలో ఈ వంతెనను నిర్మించి గిరిజనులకు రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు గెమ్మెల జానకిరావు, సిధరపు వెంకటేష్, కూనేటి బాలకృష్ణ, గెమ్మెల సంగయ్య, సుబ్బారావు, మర్రి చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

వరండాలో చదువుతున్న విద్యార్థులు

పాఠశాల భవనం సమస్య పరిష్కరించరా..?

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని పివి ఈతమనుగూడ పంచాయతీ చావిడి వలస పాఠశాల భవనం సమస్య పరిష్కరించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎం లక్ష్మణరావు, పి వీరన్న, సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చావిడివలస ప్రాథమిక పాఠశాలలో 72 మంది గిరిజన విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులు, ఒక భాషా వాలంటీర్ ఉన్నారని చెప్పారు. 10 లక్షలతో నాడు, నేడు పనులు చేపట్టినప్పటికీ బాత్ రూమ్స్, స్కూల్ గేటు, చదువుకునేందుకు ఒక గది పూర్తి కాలేదని అన్నారు. గిరిజన విద్య పర్యవేక్షణకు, మౌలిక వసతుల కల్పనకు ఎంఇఒ, విద్యాశాఖ అధికారులు ఏమి ప్రణాళిక అమలు చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. బడి బయట పిల్లలు ఉండకూడదని, సరైన మెనూ అమలు చేయాలని కోరారు. ఈ స్కూల్‌లో గదులు సరిపడక వారండ, రేకు షెడ్‌లో పిల్లలు చదువుకోవలసిన పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి స్కూల్స్ మండలంలో చాలా వున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్ఎంయు నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొండ

ఎపిఎస్ ఆర్‌టిసి పాలకొండ డిపో ఆవరణలో నేషనల్ మెజ్దూర్ యూనిటీ ఆసోసియేషన్ (ఎన్ఎంయు) కార్యాలయాన్ని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ప్రారంభించారు. పాలకొండ డిపోలో ఇయు, వైఎస్ఆర్ సంఘాల నుంచి ఎన్ఎంయులో చేరిన 49 మంది ఉద్యోగులను యూనియన్‌లోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ యూనియన్ చొరవ వల్ల ఉద్యోగులు ఒటి అలవెన్స్, కేడర్ స్టెంత్ వల్ల ఏర్పడిన సమస్యలను పరిష్కరించుకున్నట్లు తెలిపారు. అందరి సహకారంతో త్వరలో ఆర్‌టిసి ఉద్యోగులంతా మరింత పటిష్టమైన ఉద్యోగ భద్రత పొందేలా కొత్త విధానాలు రూపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలపై విజయవాడలో ఈనెల 7న నిర్వహించనున్న సమావేశంలో చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు. సమావేశంలో ఎన్ఎంయు రాష్ట్ర కోశాధికారి సివివి మోహన్, కార్యదర్శి ఆర్ నరసింగరావు, జోనల్ అధ్యక్షులు ప్రదీప్‌కుమార్, జోనల్ కార్యదర్శి సూర్యరాములు, పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, డిపో అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతీ ప్రాంతం పరిశుభ్రం కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పట్టణం లోని మూలమూలలా పరిశుభ్రమైన వాతావరణం నెలకొనాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమంలో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. గ్రామీణ పోలీసు స్టేషన్, దుర్గమ్మ గుడి తదితర ప్రాంతాల్లో ముందుగా ఆహ్లాదకర వాతావరణం నెలకొనాలని పేర్కొన్నారు. కార్యాలయాల వద్ద ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దాలని చెప్పారు. ప్రతి కార్యాలయంలో మరుగుదొడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలనిస్పష్టం చేశారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. పలు ముఖ్య కూడళ్లలో అందమైన ఆకృతులను ఏర్పాటు చేసి పట్టణానికి మరింత శోభను చేకూర్చాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఇ, జట్టు పారి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల కష్టాలు తీరినట్లే

ప్రజాశక్తి - కొమరాడ

రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సాంబమూర్తి

మండలంలోని అంతర్రాష్ట్ర రహదారిపై ప్రయాణం చేస్తున్న ప్రయాణికుల కష్టాలు కొంతమేరకు తీరినట్లేనని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి మూర్తి అన్నారు. శనివారం మండలంలోని రోడ్డు మరమ్మతు పనులను జరుగుతున్న పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నుంచి కూనేరు మీదగా మూడు రాష్ట్రాల కెళ్లే అంతరాష్ట్ర రహదారి మార్గంలో గల గోతులను శనివారం గంగ రేగువలస, గుమడ గ్రామం వద్ద మరమ్మతు పనులు ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. ఈ రహదారి మార్గంలో చిన్నా, పెద్ద తేడా లేకుండా అన్ని గోతులు కప్పాలని లేకపోతే మళ్లీ చిన్న గోతులు పెద్ద గోతులుగా మారి ఇదే పరిస్థితి ఏర్పడు తుందనీ అన్నారు. రోడ్డు మరమ్మత్తుల కోసం సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అనేకసార్లు ఆందోళన చేసిన నేపథ్యంలో మరమ్మతు పనులు చేపడుతున్నారన్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా కోరారు.

వేర్వేరు చోట్ల రైలు కిందపడి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

వీరఘట్టం: మృతుడు శివ(ఫైల్)

పార్వతీపురం పట్టణ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం జరిగిన వేరువేరు సంఘటనలలో ఇద్దరు రైలు కింద పడిమృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తల్లితండ్రులు మందలించారని వీరఘట్ట మండలం తూడి గ్రామానికి చెందిన కొనిశ శివ (27) మనస్తాపానికి గురై పార్వతీపురం పట్టణ రైల్వే స్టేషన్ సమీపంలో ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిందని రైల్వే హెచ్‌సి దేశబత్తుల రత్నకుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అలాగే పార్వతీపురం పట్టణ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు దాటే క్రమంలో రాయపూర్ పాసింజర్ రైలు ఢీ కొని బలిజిపేట మండలం నారాయణ పురం గ్రామానికి చెందిన ఇప్పలి అప్పలరాజు (64) మృతి చెందారు. కూనేరు సంతకు వెళ్లేందుకు రైలు ఎక్కాలని వస్తుండుగా ప్రమాదం జరిగి ఉంటుందని రైల్వే పోలీసులు చెబుతున్నారు. బొబ్బిలి రైల్వే హెచ్‌సి ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం ..!

ప్రజాశక్తి - కురుపాం

పూర్తిగా ధ్వంసమైన ఉదయపురం కలిగొట్టు రోడ్డు

గిరిజన ప్రాంతాల్లో రహదాలు ఒక వైపు పూర్తిగా గుంతలమయమై మరోవైపు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలతో ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా ద్విచక్ర వాహనాలపై వచ్చే వారికి గుంతలు, తుప్పల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరగడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో రహదారి గుంతలు, తుప్పలు తొలగించేందుకు ఎటువంటి ఆదేశాలు గానీ, డబ్బులుగానీ లేవని ఆర్అండ్ బి అధికారులు బాహాటంగానే చేతులెత్తేసి వెల్లడించారు. పంచాయతీ, మండల పరిషత్ అధికారులు ఆ దిశగా ఆలోచన చేపట్టలేదు. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, ఎక్కడిక్కడే మలుపులు కారణంగా రాత్రి వేళల్లో వాహనదారులు మరింత ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. తుప్పల కారణంగా విషపురుగులు సంచారం పెరిగిందని, సమీప ప్రాంత గిరిజన రైతులు కాలినడకన వెళ్లేందుకు కూడా భయాందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారులతో పాటు గిరిజన ప్రాంత రహదారులన్నీ ఇలా పలుచోట్ల తుప్పలతో కమ్మేసి, దర్శనమిస్తున్నాయి. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అధికారులు నాయకులు పట్టించుకోవాలని వాహన దారులు కోరుతున్నారు.